

విహారం.. విరామం!

ఫర్హాబాద్ జంగల్ సఫారీకి సెప్టెంబర్ 30 వరకు తాత్కాలిక విరామం ప్రకటించారు.

వివరాలు 8లో ▸



కనిపించే దైవం

ఆపదలో ఉన్న వారికి తమ వైద్యంతో పునర్జన్మనిస్తున్నారు వైద్యులు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

34.6 /23.4

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై సాయంత్రం వేళ చిరు జల్లులు కురవచ్చు.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కస్తూర్బాలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారి లలిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ప్రవేశపెట్టిన కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని.. ఆసక్తిగల విద్యార్థులు పదోతరగతి మార్కుల మెమో, టీసీ, బోనఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రెండు జిరాక్స్ సెట్లతో పాటు 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని కళాశాలకు రావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 95058 24809, 63007 54790 సంప్రదించాలని సూచించారు.

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రామన్‌పాడు పంప్‌హౌస్ శుభ్రం చేయనున్నందున మంగళవారం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ మేఘారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంకు నుంచి సరఫరా అయ్యే 45 గ్రామాలకు మంచినీటి సరఫరా ఉండదని, సాయంత్రం వరకు పనులు పూర్తిచేసి మోటార్లు ప్రారంభిస్తామని, బుధవారం నుంచి యధావిధిగా సరఫరా కొనసాగుతుందని ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

నేడు 'జూరాల'కు జాన్‌వెస్లీ రాక

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు, తెగిన రోప్‌లను పరిశీలించేందుకు మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, అజయ్ తెలిపారు. ప్రాజెక్టులో పూడిక తొలగింపు, గేట్ల మరమ్మతుల్లో అలసత్వం, కాంట్రాక్టర్‌పై చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చిస్తారని.. పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

రవాణాశాఖ మంత్రికి ఎమ్మెల్యే వినతి



వనపర్తి విద్యావిభాగం: జిల్లాకేంద్రం సమీపంలోని అప్పాయపల్లి శివారులో జిల్లా రవాణాశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. రూ.9.50 కోట్లు మంజూరు చేస్తూ జీఓ జారీ చేయనున్నట్లు మంత్రి చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. అంతకుముందు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి జూలై 4న హైదరాబాద్‌లోని లాల్‌బహద్దూర్ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సభ విజయవంతానికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే వివరించారు.

పురం.. అధ్వానం

జిల్లాకేంద్రంలో లోపించిన పారిశుద్ధ్యం

- అంతర్గత వీధుల్లో రహదారులపై పారుతున్న మురుగు
- వంద రోజుల ప్రణాళిక అమలులోనూ నిర్లక్ష్యం
- తూతూమంత్రంగా పనులు
- పట్టించుకోని అధికారులు

వనపర్తి టౌన్: జిల్లాకేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపం పట్టణవాసులకు శాపంగా మారుతోంది. కొత్తగా ఏర్పడిన కాలనీల్లో ఒకట్రెండు ప్రాంతాలు మినహా మిగతా కాలనీల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇళ్ల నుంచి వెలువడే మురుగంతా రహదారులపై పారుతుండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి పారిశుద్ధ్య కార్మికులు రాకపోవడంతో ఇళ్ల ముంగిట మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో డెంగీ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడుతున్నామని ఆయా ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో కొన్నిచోట్ల కాలనీవాసులే మురుగు తొలగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఫొటోలకే పరిమితం..

పట్టణాలను పరిశుభ్రంగా మార్చేందుకు ప్రభుత్వం వంద రోజుల ప్రణాళిక రూపొందించినా.. అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. ఫొటోల కోసం ఓ చిన్న ప్రాంతంలో హడావుడి చేయడం తప్పితే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జూన్ 2 నుంచి వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు తూతూమంత్రంగా చేపడుతుండటంతో స్వచ్ఛ ఆశయం మరుగున పడుతోంది. ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, వారితో కలిసి శ్రమదానం చేయడంతో పాటు ప్లాస్టిక్ నిర్మూలన, తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, మరుగుదొడ్ల వినియోగం తదితర అంశాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యపర్చాలి. వారితో అధికారులు ప్రతిజ్ఞ చేయించాల్సి ఉంది. ఒకటి, రెండుచోట్ల మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించడం మిగతా చోట్ల ఎలాంటి పురోగతి కనిపించకపోవడం గమనార్హం.

సాక్షి క్యాంపెయిన్



రాంనగర్ కాలనీలో ఇళ్ల ఎదుట ఇలా..



వనపర్తి 11వ వార్డులో రహదారిపై పారుతున్న మురుగు

కొత్త కాలనీల్లో..

పట్టణంలో ఏర్పడిన కొత్త కాలనీల్లో మురుగు కాల్వలు, రహదారులు లేక రోడ్లు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, మురుగు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీనికితోడు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

పురపాలికలో ట్రాక్టర్లు, ట్రాలీలు ఉన్నప్పటికీ అరకొర సిబ్బందితో పూర్తిస్థాయిలో చెత్త సేకరణ, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు కొనసాగడం లేదు. ఏటా రూ.లక్షల్లో నిధులు కేటాయిస్తున్నా.. సరైన పర్యవేక్షణ లేక పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. పలు వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో మురుగు, వర్షపు నీరు నిలిచి దోమల బెడద అధికమై ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చిన సమయంలో అధికారులు హడావుడి చేస్తూ చేతులు దులుపుకొంటున్నారే తప్పా శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా పుర అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొత్తకోట రోడ్ సమీపంలో ఇళ్ల నడుమ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

పురపాలిక	వార్డులు	జనాభా	పారిశుద్ధ్య కార్మికులు
వనపర్తి	33	70,416	150

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి..



పురపాలికలో పారిశుద్ధ్యం మెరుగునకు పక్కాగా చర్యలు చేపడుతున్నాం. వంద రోజుల ప్రణాళికలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రెయినేజీలను శుభ్రం చేయించడంతో పాటు దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. – ఎస్.వెంకటేశ్వర్లు, పుర కమిషనర్, వనపర్తి

డ్రెయినేజీలు నిర్మించడం లేదు..



మా కాలనీలో డ్రెయినేజీ నిర్మించాలని ఏళ్లుగా అధికారులను కోరుతున్నా నేటికీ స్పందించడం లేదు. దీంతో ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీరంతా రహదారులపై పారుతోంది. పారిశుద్ధ్య కార్మికులు కూడా రాకపోవడంతో మేమే తొలగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

– చెన్నయ్య, రాంనగర్‌కాలనీ

దుర్వాసన భరించలేకపోతున్నాం..



మా కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేక మురుగంతా ఖాళీ ప్రదేశాల్లో నిలుస్తోంది. దోమలు, పందుల బెడదతో సతమతం అవుతున్నాం. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– సంపూర్ణ, కాలనీవాసి, 11వ వార్డు

భయంగా బతుకుతున్నాం..



మా కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. దీనికితోడు పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విషపు పురుగుల సంచారం పెరిగింది. దీంతో భయం భయంగా బతుకుతున్నాం. పిచ్చి మొక్కల తొలగింపునకు అధికారులు శ్రద్ధ చూపడం లేదు.

– నిరంజన్‌పాషా, కొత్తకోట రోడ్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సీఈఓ పి.ఉదయ్‌కుమార్, కలెక్టర్ ఆదర్శ్ సురభి

- ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాల నమోదు తప్పనిసరి
- ఆరోగ్యశ్రీ సీఈఓ పి.ఉదయ్‌కుమార్

వనపర్తి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వివరాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని ఆరోగ్యశ్రీ సీఈఓ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా పర్యటనకు రాగా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వైద్య కళాశాలను సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రి, మాత, శిశు వైద్యశాలపై ప్రిన్సిపాల్ కిరణ్మయి ప్రాజెక్టర్ ద్వారా ప్రస్తుతం ఉన్న వసతులు, కల్పించాల్సిన సౌకర్యాల గురించి వివరించారు. ప్రొఫెసర్లు, అసోసియట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల కొరత ఉందని, విద్యార్థులు ట్రాన్స్‌పోర్టేషన్, క్యాడవర్ల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సీఈఓ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి వసతులు, డయాలసిస్ చేయించుకునే వారి వివరాలు, సమస్యలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ఆరోగ్యశ్రీ సిబ్బందితో మాట్లాడి రోజు ఎన్ని క్లెయిమ్స్ చేస్తున్నారు? వస్తున్న అవుట్ పేషంట్ల సంఖ్య ఎంత.. ఉదయాన్నే విధులకు రాగానే ఎవరు ఏయే పనులు చేస్తున్నారనే వివరాలు ఆరా తీశారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే కాకుండా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ సేవలు అందించడం.. ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయడం జరగాలన్నారు. ఆస్పత్రిలోని అన్ని పడకలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఆయన వెంట కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా మెడికల్ కో–ఆర్డినేటర్ డా. రమాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంగారావు, ఇతర డాక్టర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : బీజేపీ

వనపర్తి రూరల్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని చందాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సందా వెంకటేష్ అధ్యక్షతన జరిగిన రచ్చబండ కార్యక్రమానికి ఆయనతో పాటు జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేటీ పడావో.. బేటీ బచావో పథకంతో మొదలుకొని పేదలకు మరుగుదొడ్ల నిర్మాణం, రాయితీ గ్యాస్ సిలిండర్లు, ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం ఇలా అనే పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వారు పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, కుమారస్వామి, బాలరాజు, వాకిటి సుదర్శన్, చిన్న నర్సింహ, రాఘవేందర్, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య రక్షణే 'జై సంవిధాన్' లక్ష్యం



కస్తూర్బా విద్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: ప్రజాస్వామ్య రక్షణే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర సోమవారం మండలంలోని మల్లాయిపల్లి, చింతకుంటలో సాగింది. ఈ సందర్భంగా మంత్రి ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని.. మహాత్మాగాంధీ వారసత్వం, డా. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా జై సంవిధాన్ యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గాంధీ, అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా..

రైతు భరోసా అందని రైతులు ఆందోళన చెందవద్దని.. గ్రామాల వారీగా అర్హుల వివరాలు సేకరించి న్యాయం చేస్తామని మంత్రి జూపల్లి తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి వచ్చిన మంత్రికి సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు అర్హత ఉన్న రైతు భరోసా రాలేదని.. మంజూరు చేయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 1.50 కోట్ల ఎకరాలకుగాను ఇప్పటి వరకు 1.46 కోట్ల ఎకరాలకు రైతు భరోసా జమ చేసినట్లు తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

బాలికల విద్యకు ప్రాధాన్యం..

కాంగ్రెస్ ప్రభుత్వం బాలికల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో రూ.81 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల గదులను మంత్రి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయం చాలా విలువైందని, వినియోగించుకొని లక్ష్యానికి అనుగుణంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని.. సమయం విలువ, గెలుపు సాధించే వరకు విశ్రమించకూడదని తెలిపే పాటలను సెల్‌ఫోన్‌లో విద్యార్థులకు వినిపించారు. ప్రతి విద్యార్థికి ఈత తప్పక వచ్చి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఈఓ అబ్దుల్ ఘనీ, జీసీడీఓ సుబ్బలక్ష్మి, ఎంఈఓ శ్రీనివాసులు, తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎస్‌ఓ హేమలత, ఏపీఎం వెంకటేష్‌యాదవ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి



ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఉద్యాన, వ్యవసాయ అధికారులు

కొత్తకోట రూరల్: రైతులు ఆయిల్‌పామ్ సాగుచేసేలా అధికారులు ప్రోత్సహించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలో రైతులు నాగరాల తిరుపతిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి పొలాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులతో మాట్లాడి ఎకరాకు ఎంత ఖర్చవుతుంది.. ఎంత దిగుబడి వస్తుందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గెలలను పరిశీలించి అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 2025–26 సంవత్సరంలో జిల్లాలో 3,500 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించారని.. అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకొని రైతులకు కావాల్సిన డ్రిప్ పరికరాలు, మొక్కలను అందించాలని కోరారు. జిల్లాలోని 15 మంది రైతులు 41 ఎకరాల్లో మొక్కలు నాటే మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఉద్యాన అధికారి వి.విజయభాస్కర్, అధికారులు ఎన్.సురేష్, ఆర్.కృష్ణ, మండల వ్యవసాయ అధికారి జాస్మిన్, ఏఈఓ రవీందర్‌రెడ్డి, ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జోనల్ అధికారి, ఏరియా మేనేజర్, డ్రిప్ కంపెనీ అధికారులు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, రైతులు హరీశ్‌రెడ్డి, బుచ్చన్న, మాదన్న, మోహన్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ నిర్మాణాలకు శంకుస్థాపన..

కొత్తకోట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణాలకు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.33 లక్షల వ్యయంతో భవనాలు నిర్మిస్తున్నామని, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌లను ఆధునికీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పుర కమిషనర్ సైదయ్య, మండల విద్యాధికారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జూరాలలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



ఎగువ జూరాలలోని పవర్‌హౌజ్ కేంద్రం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద చేరుతుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుందని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఎగువ 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 73.521 మి.యూ, దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 86.948 మి.యూ. ఉత్పత్తి చేపట్టినట్లు వివరించారు. రెండు కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 160.469 మి.యూ విద్యుదుత్పత్తి సాధించామన్నారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీటిని విద్యుదుత్పత్తికి ఉపయోగించి దిగువ శ్రీశైలం జలాశయానికి వదులుతున్నామని వివరించారు.

రామన్‌పాడులో తగ్గిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం సముద్ర మట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, కుడి కాల్వల్లో 150 క్యూసెక్కుల నీరు పారుతుండగా.. సమాంతర కాల్వకు సరఫరా లేదన్నారు. రామన్‌పాడు జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 610 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 45 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

కోయిల్‌సాగర్ @ 20.6 అడుగులు..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు 20.6 అడుగులకు చేరింది. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా జూరాల నుంచి ఒక పంపును రన్ చేసి నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. నెల రోజులుగా ప్రాజెక్టులోకి వస్తున్న నీటితో రోజుకు కొంత మేర నీటిమట్టం పెరుగుతుంది. జూరాల నుంచి నీరు రాక ముందు 11అడుగులుగా ఉన్న నీటిమట్టం 9.6 అడుగులు పెరిగి 20.6 అడుగులకు చేరింది. పాత అలుగు స్థాయి 26.6 అడుగులు ఉండగా మరో 6 అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి నీటిమట్టం చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి గేట్ల లేవల్ వరకు నీటిమట్టం 32.6 అడుగులు ఉండగా మరో 12 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది. ఈ ఏడాది జూన్ చివరి వరకే నీటిమట్టం బాగా పెరగడం ఇదే మొదటిసారి.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న కలెక్టర్

వనపర్తి: ప్రజావాణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు జి.వెంకటేశ్వర్లు, యాదయ్యతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజావాణి ఫిర్యాదుదారులకు వినతులపై తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు మొత్తం 87 ఫిర్యాదులు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 14 వినతులు..

వనపర్తి: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి 14 వినతులు వచ్చాయి. ఎస్పీ రావుల గిరిధర్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత ఠాణాల ఎస్‌ఐ, సీఐలకు ఫోన్ చేసి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. 8 భూ తగాదాలు, 4 కుటుంబ ఘర్షణలు, రెండు పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ కార్యాలయ సిబ్బంది తెలిపారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ : యువకుడి దుర్మరణం


చరణ్ (ఫైల్)

అయిజ: రెండు బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసరావు కథనం మేరకు.. మేడికొండకు చెందిన చరణ్ (26) ఆదివారం పట్టణం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో పుర పరిధిలోని తుపత్రాలకు చెందిన రమేష్ బైక్‌పై అయిజకు వస్తుండగా తుపత్రాల సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చరణ్‌కు గాయాలు కాగా అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స కోసం అర్ధరాత్రి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రాఘవేందర్ (ఫైల్)

వెల్దండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం కర్నూల్ జిల్లాలోని నంద్యాల–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వెల్దండ మండల కేంద్రానికి చెందిన బచ్చు రాఘవేందర్(34) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ హెల్త్ ఇన్సురెన్స్ కంపెనీలో పాలసీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. నంద్యాలలో ఉంటున్న స్నేహితుడి వద్దకు తల్లి పద్మమ్మతో కలిసి వెళ్లాడు. తల్లిని స్నేహితుడి కుటుంబ సభ్యుల వద్ద ఉంచి రాఘవేందర్, స్నేహితుడు కారులో శ్రీశైలం వెళ్లారు. మార్గమధ్యలో కారు నిలిపి సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో కాలకృత్యాల కోసం రోడ్డు దాటుతుండగా నంద్యాల–శ్రీశైలం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో రాఘవేందర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వెల్దండలోని బంధువులు, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లారు. రాఘవేందర్ మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి. అతనికి తల్లిదండ్రులు పద్మ, సత్యనారాయణ, అక్క రాజేశ్వరి ఉన్నారు.

విహారం.. విరామం!

- ఫర్హాబాద్ జంగల్ సఫారీ తాత్కాలికంగా నిలిపివేత
- నేటి నుంచి సెప్టెంబరు 30 వరకు నిషేధాజ్ఞలు
- అమ్రాబాద్ టైగర్ రిజర్వు(ఏటీఆర్)లో ఆంక్షలు
- జంతువుల సంతానోత్పత్తి సమయం.. నిబంధనలు కఠినం

అచ్చంపేట: నల్లమల 'అంటేనే పకృతి రమణీయతకు నిలయం.. పక్షుల కిలకిలరావాలు.. జలపాతాలు.. వన్యప్రాణుల పరుగులు పర్యాటకులను పరవశింపజేస్తాయి. పెద్దపులులు, చిరుతలు కనిపిస్తూ ఉత్సుకతను రేకెత్తిస్తాయి. ఈ ఏడాది ముందుస్తు వర్షాల నేపథ్యంలో నల్లమల అభయారణ్యం పచ్చతోరణంగా మారింది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు మాసాలు క్రూరమృగాలకు సంతానోత్పత్తికి అనువైన కాలం.. ఈ సమయంలో వాటికి ప్రశాంతత అవసరం.. పర్యాటకులు సంచరిస్తే వాటి ఏకాంతానికి భంగం కలుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని జూలై 1నుంచి సెప్టెంబరు 31వ తేదీ వరకు అటవీశాఖ అధికారులు పర్యాటక విరామాన్ని ప్రకటించారు. నల్లమల అందాలు, వన్యప్రాణులను వీక్షించాలనుకునే పర్యాటకులు మూడు నెలలు ఆగాల్సిందే. జిల్లా పరిధిలో పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. మన్ననూర్, పర్హాబాద్–వ్యూ పాయింట్ వరకు జంగిల్ సఫారీ సౌకర్యం ఉంది. నల్లమల కృష్ణా పరివాహక ప్రాంతంలో జంతువులకు ఇబ్బందులు కలగకుండా పర్యాటకులు, జంతు సందర్శకులను సందర్శించకుండా పర్హాబాద్ సఫారీని తాత్కాలికంగా మూసివేస్తారు. దీంతో నల్లమలలోని పర్హాబాద్, వ్యూ పాయింట్, చెంచుపెంటలను పర్యటించే అవకాశం ఉండదు. తిరిగి అక్టోబరు 1నుంచి సఫారీ టూర్ ప్రారంభంకానుంది. ఈ మార్గంలో ప్రయాణించేవారు, పర్యాటకులు మన్ననూర్‌లో విడిది చేసేందుకు మాత్రం అనుమతించనున్నారు. ప్రస్తుతం పశువుల కాపర్లు, ఇతరుల సాధారణ ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు.


నల్లమల అటవీ ప్రాంతం

మూడు నెలలపాటు నిషేధాజ్ఞలు

జూలై నుంచి సెప్టెంబరు వరకు పులులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువుల సంతానోత్పత్తికి అనువైన రోజులు కావడంతో వాటి ఏకాంతతకు భంగం కలుగొద్దని నిషేధాజ్ఞలు విధించారు. ఈమూడు నెలలపాటు అటవీప్రాంతంలోకి పర్యాటకులు, ఇతరులనెరినీ అనుమతించరు. ఈ తరుణంలో వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు మరింత సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. జంతువుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారు. అదేవిధంగా అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలతోపాటు అక్క మహాదేవి గుహలకు వెళ్లే అవకాశం లేదు.

అతిపెద్ద టైగర్ రిజర్వు

రాష్ట్రంలో పేరుగాంచిన అడవులు నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని ఏటీఆర్‌తోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ అడవులు ఉన్నాయి. ఇందులో దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్టుగా అమ్రాబాద్ అభయారణ్యం గుర్తింపు పొందింది. 2,611.39 చదరపు కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉండగా.. ఇందులో 2,166.37 చదరపు కి.మీ అభయారణ్యం కాగా 445.02 చదరపు కి.మీ బఫర్‌జోన్‌గా ఉంది. అభయారణ్యాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అటవీశాఖ లెక్కల ప్రకారం నల్లమలలో మొత్తం 34 పెద్దపులులు ఉన్నాయి. వీటిలో 11 మగ పులులు, 15ఆడ పులులు, 8 చిన్న పిల్లలు(కబ్స్)ఉన్నాయి. 903 ప్రాంతాలు పెద్దపులుల అవాసాలుగా గుర్తించారు. వీటితోపాటు 170కిపైగా చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, దుప్పులు, తోడేలు, అడవి కుక్కలు, జాకెల్, నీల్‌గాయ్, సాంబర్, చీతల్, నాలుగు కొమ్ముల జింకలు, చింకార, అడవి పందులు, మాకాక్, చారల ఉడతలు, కుందేలు, మింగీసలు, అడవి పిల్లి, గుడ్లగూబల తోపాటు పులులకు ఆహారంగా ఉపయోగపడే శాఖాహార జంతువులు, కీట కాలు ఇతర జంతువులు ఉన్నాయి.

పెద్దపులులు జతకట్టే సమయం

నల్లమల అడవులు, వన్యప్రాణులు అంతరించిపోతున్న సమయంలో వన్యప్రాణుల సంతతిని పెంచుటకు అటవీశాఖ 2018 తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రతి ఏటా వర్షకాలంలో పర్యాటకుల కదలికలు లేకుండా ఆంక్షలు విధిస్తున్నారు. వన్యప్రాణులు ఏడాదంతా జతకట్టిన, ముఖ్యంగా పెద్దపులి జతకట్టు సమయం ఇదే. ఆడపులుల గర్భాదారణ సమయం 16వారాలు అయితే.. ఆడపులి గర్భాదారణ సమయంలో ఉన్నట్లు వాటి మూత్రవిసర్జన గుర్తుల ఆధారంగా మగ పులులు ఆకర్షించబడుతాయి. సాధారణంగా ఒక ఈతలో 3–4 పులి పిల్లలకు జన్మనిస్తాయి. వీటిని దట్టమైన అటవీ ప్రాంతాలు లేదా రాత్రిపగుళ్లు, నెరెలు ప్రాంతాల్లో పొదుగు చేసుకుంటాయి. ఆడపులి జీవిత కాలంలో సుమారుగా సమాన సంఖ్యలో ఆడ, మగ పిల్లలకు జన్మనిస్తుంది. ఆడపులులు సంతానోత్పత్తికి సిద్ధమయ్యే కాలం 3–4 సంవత్సరాలు కాగా.. మగ పులులు కాస్త ఆలస్యంగా 4–5 సంవత్సరాల కాలంలో సంతానోత్పత్తికి సిద్ధమవుతాయి.

పులులకు ఏకాంతం కల్పించేందుకు..



పులులకు ఏకాంత వాతావరణాన్ని కల్పించేందుకు అడవిలోకి ప్రవేశించకుండా పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తున్నాం. ఇందుకు ప్రజలు, యాత్రికులు సహకరించాలి. అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశించడంపై ఆంక్షలు నిరంతరం కొనసాగే ప్రక్రియ. జూలై నుంచి సెప్టెంబర్ వరకు పెద్దపులి జతకట్టే రోజులు కావడంతో మూడు నెలలపాటు యాత్రికులను అనుమతించడం లేదు. పర్హాబాద్ వ్యూ పాయింట్ సఫారీ సేవలు నిలిపివేశాం. ప్రధాన రహదారి గుండా వాహనదారులు 30కిలోమీటర్ల వేగం మించకుండా వెళ్లాలి.

– రోహిత్‌గోపిడి, జిల్లా అటవీశాఖ అధికారి

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

జడ్చర్ల: గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారు చేసి గుట్టుగా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని మాచారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహేంద్ర పాల్, సత్యం ఎండు గంజాయిని ఆరు గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.300కు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న తాము వారిపై దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 240 గ్రాముల గంజాయి తోపాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కార్తీక్‌రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులతో ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి

కన్న కొడుకులు గెంటేశారు.. ఆదుకోండి సారూ...!



'కడుపున పుట్టిన పిల్లలు పట్టెడన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటేశారు.. పైగా నా పేరున ఉన్న భూమిని కూడా లాక్కున్నారు' అంటూ 70 ఏళ్ల ఓ వృద్ధురాలు సోమవారం గద్వాల కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్‌కు చెందిన పాపమ్మకు 4 కుమారులు. వృద్ధాప్యంలో అండగా నిలబడాల్సిన వారు ఆమె పేరిట ఉన్న 2.37 ఎకరాల భూమిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతేగాకుండా కనీసం రోజు భోజనం కూడా పెట్టకుండా ఇంటి నుంచి గెంటేశారు. తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది.

– గద్వాల

భూగర్భ కేంద్రం సీఈగా కేవీవీ సత్యనారాయణ

దోమలపెంట: టీఎస్‌జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా కేవీవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విద్యుత్ సౌధ, హైదరాబాద్‌లో ఎస్ఈ, జనరేషన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రమోషన్లు ఇవ్వొద్దని కోర్టులో స్టే ఉండడం వల్ల ఇన్‌చార్జి సీఈగా భూగర్భ కేంద్రానికి వచ్చారు. ఆయన జెన్‌కోలో సీనియర్ కావడంతో జెన్‌కో యాజమాన్యం ఈ బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయనకు భూ గర్భ కేంద్రం ఇంజినీర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పటి వరకు కేంద్రం సీఈగా విధులు నిర్వహించిన కె.రామసుబ్బారెడ్డి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు రామసుబ్బారెడ్డి సేవలను కొనియాడి ఘనంగా వీడ్కోలు పలికారు.


కేవీవీ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామసుబ్బారెడ్డి

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

అడ్డాకుల: మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వృద్ధుడు గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిసిన వివరాల ప్రకారం.. గుడిబండకు చెందిన సురేందర్ రెడ్డి(64)ని పెళ్లైన కొత్తలో భార్య వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఊరిలోనే ఉంటున్న సురేందర్‌రెడ్డి కొన్నాళ్ల నుంచి మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని సోదరుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులకు మూడేళ్ల జైలు

అలంపూర్: భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడంతో మహిళ ఆత్మహత్యకు కారణమై నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అలంపూర్‌కు చెందిన శైలజకు ఇదే మండలం గుందిమల్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్యకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది క్రితం వారికి పాప పుట్టింది. కొంతకాలం అన్యోన్యంగా ఉన్నారు. తర్వాత భర్త, అత్తమామలు ఆమెను వేధింపులకు గురి చేశారు. వారి వేధింపులు తాలలేక శైలజ(28) కుమార్తెతో కలిసి కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి సావిత్రి 2015 అక్టోబర్ 17న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా భర్త ఈశ్వరయ్య, మామ పెద్దయ్య, అత్త మునెమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నేరం రుజువు కావడంతో 2023 మార్చిలో అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భర్త, అత్తమామలకు జైలుశిక్ష విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు పైకోర్టుకు వెళ్లారు. ప్రిన్సిపల్ జిల్లా కోర్టు జడ్జి ప్రేమలత కింది కోర్టు శిక్షణ సమర్థిస్తూ నిందితులకు 3 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష పడటానికి కృషి చేసిన డీఎస్పీ మొగిలయ్య, సీఐ రవిబాబు, అప్పటి అలంపూర్ ఎస్ఐ పర్వతాలు, ప్రస్తుత ఎస్ఐ వెంకట స్వామి, సహకరించిన పోలీసులను జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు అభినందించారు.

కనిపించే దైవం..

దేవుడు మనిషికి జన్మనిస్తే.. వైద్యుడు తన వైద్యంతో పునర్జన్మనిస్తాడు. వారి ఆత్మీయ స్పర్శ రోగికి అపరసంజీవని. అందుకే వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు. ప్రతి ఒక్కరూ వైద్యుడిలో దేవుడిని చూస్తారు. అత్యవసర పరిస్థితుల్లో తమను నమ్ముకొని వచ్చే వారి ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా సేవలందించే దైవంగా అందరి మన్ననలు అందుకుంటున్నారు వైద్యులు. మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం. – పాలమూరు




నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

ఎంత గొప్ప వ్యక్తి అయినా.. పేదవాళ్లు అయినా చేతులెత్తి నమస్కరించేది కేవలం వైద్యులకు మాత్రమే. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. ప్రమాదంలో గాయపడినా.. ఎలాంటి ఆపద వచ్చినా గుర్తుకు వచ్చేది వైద్యులే. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. రోజుకు వేల మంది రోగులకు వైద్యులు వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్నారు. కొందరు వైద్యులు మానవత్వంతో అభాగ్యులకు సేవలందిస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. మరికొందరు వృతి ధర్మానికి కట్టుబడి మానవతా విలువలతో వైద్యసేవలు అందిస్తున్నారు.

■ మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల 2016లో ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌ల విద్యార్థులు వైద్యవిద్యను పూర్తిచేసుకున్నారు. 2016, 2017, 2018 సంవత్సరాల్లో 150మంది చొప్పున మొత్తం 450మంది ఎంబీబీఎస్ పూర్తిచేసుకొని బయటకు వెళ్లారు. ప్రస్తుతం 2019 బ్యాచ్‌లో 175మంది హౌజ్ సర్జన్లుగా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. 2020 నుంచి ప్రతి బ్యాచ్‌లో 175 మందికి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి కొత్తగా మరో 175మందికి అవకాశం కల్పించారు.

కరోనా సమయంలో ఇంటింటికెళ్లి..



కరోనా సమయంలో ఇంటింటికెళ్లి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరికీ ధైర్యం కల్పించడం నా జీవితంలో మరిచిపోలేను. నేను 2014లో కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తిచేశా. 2017లో సర్వీస్‌లోకి వచ్చాను. మొదట మిడ్జిల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరాను. డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను కట్టడి చేయడానికి ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

– డా.శివకాంత్, మెడికల్ ఆఫీసర్, మిడ్జిల్

ప్రతి గ్రామానికి వెళ్లి సేవలు..

కొల్లాపూర్ ఏరియాలో ఉన్న ప్రతి గ్రామానికి వెళ్లి వైద్యసేవలు అందించా. ఓ అమ్మాయి డెంగీ బారినపడి పరిస్థితి ఇబ్బందిగా ఉండగా.. ఆమె ఇంటికి వెళ్లి పర్యవేక్షించాను. నేను 2015లో కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత ఎన్ఆర్‌సీ, హైదరాబాద్ బస్తీ దవాఖానలో, కొల్లాపూర్‌లో పనిచేశాను. గతేడాది జనవరి 1నుంచి ఇక్కడ సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో ఆర్ఎంఓగా పని చేస్తున్నాను. మంచి గైనకాలజిస్టుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.



– డా.శిరీష, ఆర్ఎంఓ, జిల్లా జనరల్ ఆస్పత్రి

ప్రసవాలపై ప్రత్యేక దృష్టి..



నేను దామరగిద్ద మెడికల్ ఆఫీసర్‌గా వచ్చిన తర్వాత ప్రతినెలా 15 కాన్పులు చేస్తున్నాం. ఈ నెలలో 26 సాధారణ కాన్పులు చేశాం. గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తూ.. సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాం. 2016లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన తర్వాత హైదరాబాద్‌లో పనిచేశాను. దామరగిద్దకు డిసెంబర్‌లో వచ్చాను. గతంలో ప్రతినెలా ఐదు వరకు మాత్రమే సాధారణ కాన్పులు జరిగేవి.

– డా.సుదీప్త, మెడికల్ ఆఫీసర్, దామరగిద్ద

ఏడాదిలో 315 సాధారణ కాన్పులు..



ఏడాది కాలంలో దేవరకద్ర పీహెచ్‌సీలో 315 సాధారణ కాన్పులు చేశాం. సాధారణ ఓపీతో పాటు ప్రసవాలపై ఎక్కువగా దృష్టి పెట్టాను. పీహెచ్‌సీల వారీగా పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధిక కాన్పులు ఇక్కడే అవుతాయి. హైరిస్క్ ఉన్న కేసులను సైతం బాధ్యతగా తీసుకుని ప్రసవాలు చేస్తున్నాం. నేను 2015లో ఎంబీబీఎస్ పూర్తిచేశాను. ఆ తర్వాత లట్టుపల్లి, బిజినేపల్లి, కోయిల్‌కొండ, మహబూబ్‌నగర్‌లో పనిచేశాను. ప్రస్తుతం దేవరకద్రలో పనిచేస్తున్నా. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నాం.

– డా.శరత్‌చంద్ర, దేవరకద్ర పీహెచ్‌సీ